ఉడిగాడు ఆశ్చర్యంగా వాళ్ళని చూస్తూ.

"వాళ్ళకేవో అర్జంటు పనులు తగిలేయట, రాలేక పోయినందుకు ఏమీ అనుకోవద్దనీ, గుడ్ విషెస్ చెప్పమనీ అన్నారు" అన్నాడు కృష్ణ విశ్వనాథం చేతులు పట్టుకుని దగ్గరకు లాక్కుని నెమ్మదిగా, "వచ్చే సంవత్సరం బారసాలకు తప్పక వస్తామన్నారు" అన్నాడు ప్రసాద్ చిన్నగా నవ్వుతూ

"ఇంకా నయం షష్టిపూర్తికి వస్తామన్నారుగాదు!" అంటూ నవ్వుతూ లోపలికి నడిచేడు, విశ్వనాథం. స్నేహితులు కూడా నవ్వుతూ అతన్ని అనుసరించేరు.

* * *

"శోభా! జడబాగా ఉందో లేదో చూసుకో" అంది పెళ్ళికూతురు శోభారాణితో, వదిన శాంతమ్మ, పైకిలేస్తూ.

అద్దంలో తన ప్రతిరూపం చూసుకునే సరికి శోభారాణికి ఆశ్చర్యం, సిగ్గు కలిగేయి.

నుదుట నామం, బుగ్గన చుక్క, కళ్ళని కాటుక, మెళ్ళో కొత్త ఆభరణాలు, మిస మిసలాడే పట్టుచీర, చేతులకు గోరింట, జడనిండా పువ్వులు, అబ్బ!! ఆ రూపం అలాగే చూసుకోవాలనిపించింది ఆమెకు. కానీ పక్కనే ఉన్న వదిన ఆట పట్టిస్తుందని ముఖం ఇటు త్రిప్పేసింది. శోభను చూసి, ఒక్కసారి మొటిమలు విరచి, ముసిముసిగా నవ్వుతూ మరో పనిలోకి వెళ్ళింది శాంతమ్మ.

"పిన్నీయ్! కవర్లు! కవర్లు!!" అంటూ రెండు గ్రీటింగ్ కవర్లు తెచ్చి, శోభ ఒళ్ళో పడేసి తుర్రు మన్నాడు సాంబుగాడు.

శోభ ఆత్రంగా ఒక కవరు తీసింది.

"శ్రీమతి కాబోతున్న మిస్. శోభారాణికి, సుఖాంత సినిమాలోలాగ ప్రేమించిన వానినే పెళ్లి చేసుకుంటున్న మీ ఆదర్శ వివాహ శుభ సందర్భంలో, మా హృదయ పూర్వక శుభాకాంక్ష లందచేస్తూ, మీ వైవాహిక జీవితం మరింత ఆదర్శవంతమై ఉండాలని నిత్యము కోరుకుంటూ నీ స్నేహితురాండ్రు బబిత, లత, పూర్ణిమ." దాన్ని మరోసారి చదువుకుని నవ్వుకుంటూ రెండవ కవరు తీసింది శోభారాణి.

ఆమె గుండె ఝల్లుమంది. బుగ్గలు ఎరుపెక్కాయి. ముఖం సిగ్గుతో ముడుచుకు పోయింది. ఆ కవరు పెళ్లికొడుకు విశ్వనాథం నుంచి "మిస్ శోభారాణీ, ఈ శుభ సందర్భంలో నా శుభాకాంక్షలందుకో!" ఒక్కసారి గర్వంగా, తృప్తిగా చూసుకొని, ఎవరో వస్తున్న అలికిడవగా చటుక్కున తీసి దాచేసిందామె ఆ కాగితాన్ని.

* * *


పందిట్లో ఒక చోట ఊరేగింపుకై కారుని శ్రద్ధగా, అందంగా అలంకరిస్తున్నాడు డ్రయివరు వీరాస్వామి. కొందరు పిల్లలు అతనికి అవీ, ఇవీ అందివ్వటానికి సరదాపడుతున్నారు.

పందిట్లో మరొకచోట పెళ్లికూతురు మేనమామ రామలింగం, దూరపు బంధువు భూపతి, కబుర్లలో ఉన్నారు.

"ఎంత డబ్బున్నవాళ్లకైనా డబ్బు చేదా? చెప్పు రామలింగం బావా?" అన్నాడు భూపతి, కనుసన్నల్లోంచి రామలింగాన్ని గమనిస్తూ.

"అలా చేదయితే ఈ పాటికే సోషలిజం వచ్చునయ్యా భూపతీ, దేశంలో!" అన్నాడు రామలింగం నవ్వుతూ

ఆ ఛలోక్తికి రెండు క్షణాలు విరగబడి నవ్వి, "మరి ఈ పెళ్లికొడుక్కి కట్నం ఎందుకు తీసుకోవటం లేదు?" అన్నాడు ఆసక్తిగా చూస్తూ భూపతి.



# పెళ్ళి

శ్రీనివాస్

**"కట్నం తీసుకు తీరాలని శాస్త్రమేమైనా ఉందేమిటయ్యా భూపతీ?" అని నవ్వుతూ, "అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకున్నారుట, అబ్బాయి కట్నం తీసుకుందుకు ఇష్టపడలేదు, సరే! 'తథాస్తు' అన్నారు పెద్దలు" అన్నాడు రామలింగం.**

"అబ్బాయి వద్దంటే అతని తండ్రి మానేస్తాడుటయ్యా? పోనీ, మీ బావ, కూతురికి కట్నం ఇవ్వలేని స్థితిలో కూడా లేడు కదా?" అన్నాడు భూపతి

"అయితే ఇప్పుడేమిటంటావ్?" అన్నాడు. విసుగ్గా రామలింగం.

"నేనే మంటాను మధ్యలో? అయినా, ప్రేమ గుడ్డిదయ్యా, పూర్తిగా అమ్మాయి ఇష్టానికే వదిలెయ్యకూడదు. పెద్దవాళ్లం మనం కూడా కొంచెం వెనకా, ముందూ చూడాలి కదా! అయినా ఇప్పడేమనుకుని ఏం లాభంలే" అంటూ నసిగాడు భూపతి

"ఏమిటోయ్ భూపతి? ఇప్పడేమయింది?" అన్నాడు రామలింగం కొంచం ఖంగారు పడుతూ

"అహ ఏమీ లేదు, నే విన్నదేమంటే, అబ్బాయికేదో గుండె జబ్బుందిట!" నెమ్మదిగా, ముందుకు వంగి అన్నాడుభూపతి

రామలింగం గుండె ఝిల్లుమంది

"భూపతీ? ఏమిటీ? నిజమేనా?"

రామలింగం మాటలో ఒణుకు కనిపెట్టి, అతి మామూలుగా జేబులోంచి చుట్ట తీసుకుని నోట్లో పెట్టుకుని "ఏమో బావా! నే విన్నదది ఇప్పటికైనా సమయం మించిపోలేదు కనుక, ఏ డాక్టరుకైనాచూపించచ్చు, నిజమయితే ముఖంమీద అడగొచ్చు, లేకపోతే మంచిదేకదా!" అన్నాడు భూపతి, అగ్గిపుల్లగీసి చుట్టముట్టిస్తూ

"కానీ మా బావ బాధపడతాడయ్యా! ఇప్పడెలాగ చెప్పడం?" డీలా పడిపోయాడు రామలింగం

"పోనీ బావా! ఊరుకో మీ బావ అలిశయంగా కబుర్లు చెబుతాడుగా, మరి కూతురికి పెళ్లి సంబంధం చూసుకోలేడా!?" అన్నాడు కసిగా భూపతి

"లేదు భూపతీ! మా బావ పైకి అలా మాట్లాడుతాడు గానీ, అతనికేమీ తెలియదయ్యా, వట్టి భోళా మనిషి. ఉండు నే చెప్పి చూస్తా" అంటూ లేచాడు రామలింగం.

# పెళ్లి

రామలింగాన్ని ఒక కంట కనిపెడుతూ తనూ లేచాడు భూపతి

* * *


సుబ్బయ్య ఎంత తృప్తిని, సంతోషాన్ని, అనుభవిస్తున్నాడు తన కొడుక్కి తాను కోరుకున్న అమ్మాయిని, అతని కోరికకు అనుగుణ్యంగా కట్నం తీసికోకుండా వివాహం చేస్తున్నందుకు — అలా చేయగలుగు తున్నందుకు! అతని పెదవులు అదే విషయాన్ని స్పష్టంగా చెపుతున్నట్లు ఉన్నాయి

"ఏమిటోయ్ బావా! సంతోషం పట్టలేక పోతున్నావ్?!" అంటూ వచ్చి, సుబ్బయ్య పక్కన తిష్ట వేసాడు భూపతి.

సుబ్బయ్య చిన్నగా నవ్వి ఊరుకున్నాడు

"ఇప్పుడు లోకంలో ఒక మంచి పని చెయ్యటానికి కూడా ఎంత గుండె నిబ్బరం కావాలి బావా! మంచికి పోతే చెడు ఎదురౌతుంది, ఆ చెడు నెదుర్కోవాలిగా మరి?"

అన్నాడు ఏదో వేదాంతం చెపుతున్నట్లు భూపతి.




"అందుకే నేమిటోయ్ భూపతి నువ్వెప్పుడూ మంచికి పోవూ?" అన్నాడు సుబ్బయ్య గలగలా నవ్వుతూ

"నే చెప్పేది వినవయ్యా బావా!" అంటూ ముందుకు వంగి, సుబ్బయ్యలో వినటానికి ఉత్సుకత కలుగచేసి, "మీ అబ్బాయికి కట్నం తీసికోకుండా వివాహం చేస్తున్నావా, దానికి వాళ్లేవో కారణాలు ఊహిస్తున్నారు" అన్నాడు నిగూఢంగా భూపతి

"ఏమంటున్నారేమిటి?" అడిగాడు సుబ్బయ్య లోలోన కొంచం భయంతోచగా.

"మీ అబ్బాయికి గుండెజబ్బుందనీ, డాక్టరు చేత పరీక్ష చేయించుకుందా మనీను" అన్నాడు నెమ్మదిగా భూపతి

"ఆఁ!" క్షణం సేపు అల దిమ్మెక్కింది సుబ్బయ్యకి

"భూపతీ! నిజమేనా? ఎవరన్నారు?" గర్జిస్తున్నట్టుగా అడిగాడు సుబ్బయ్య

"ఏదో వాళ్ళనుకుంటుంటే నా చెవిన పడింది అయినా నాకు మీరిద్దరూ కావల్సిన వాళ్ళేకదా!" దులిపేసు కుంటున్నట్లుగా అన్నాడు భూపతి

ఒక్కక్షణం ఆగి, మళ్ళా అన్నాడు భూపతి, "పోనీ బావా! పరీక్ష చేయించుకోనీ, వాళ్ళ అనుమానమూ తీరుతుంది కానీ మన మాటమీద కూడా నమ్మకం ఉంచటం లేదు వాళ్లు"

"నలుగురిలోనూ, నా కొడుకుని పరీక్ష చేయిస్తాడా ఆయన?" ఇదేమైనా బజారులో ఉన్న వస్తువను కుంటున్నాడేమో, అసలంత వరకు వస్తే ఈ పెళ్ళేజరగదు" కోపంతో ఊగిపోతున్నాడు సుబ్బయ్య

"ఒద్దు బావా! పీటలమీద పెళ్ళి ఆగిపోతే ఇక పాపం ఆ అమ్మాయికి మరి పెళ్ళవుతుందా?" మొసలి కన్నీరు కార్చాడు భూపతి

"మమ్మల్నింత అవమానించ టానికి పూనుకున్న తరువాత ఇక ఎలా సహించమంటావు భూపతీ!" అన్నాడు సుబ్బయ్య బాధగా, కోపంగా

"అంతేలే!!" అన్నట్లుగా మూలిగేడు భూపతి

సుబ్బయ్య హృదయం ఉడికి పోతోంది. రత్నంలాంటి తన కొడుకుకి గుండె జబ్బుందంటారా? ఇంతేనా తన మంచి పనికి ప్రతిఫలం? పదేపదే అనుకుని మదనపడ సాగేడు సుబ్బయ్య

"సుబ్బయ్య బావగారూ! ఒక్కసారిలా

వస్తారా?''అని మెమ్మదిగా పిలిచాడురాఘవులు, పెళ్ళికూతురి తండ్రి. వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అటువైపువెళ్ళాడు సుబ్బయ్య.

రామలింగం ముందుకు వచ్చి. ''మీరు మరోలా భావించకపోతే, ఒక్కసారి మా ఫామిలీ డాక్టరు చేత అబ్బాయిని పరీక్ష చేయించుకుంటాం'' అన్నాడు.

''రామలింగం గారూ! మేం చేసినతప్పల్లా బెట్టుచెయ్యకుండా ఈ పెళ్ళికి ఒప్పుకోవటమే, కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవడమే; మా మాటమీద మీకు నమ్మకం లేనపుడు, రత్నం లాంటి మా అబ్బాయిని గురించే మీరిలా అనుకోవటానికి కూడా సంకోచించనపుడు, మీ సంబంధం కూడా మేము కలుపుకోలేము'' అన్నాడు సుబ్బయ్య కోపంగా.

''సుబ్బయ్య గారూ...'' అంటూ ఏదో నచ్చచెప్పబోయేడు రామలింగం; కానీ, రాఘవులు, ''సుబ్బయ్యగారూ! మీరు డాక్టరు పరీక్షకు ఒప్పుకోనప్పుడు, మా అనుమానమే బలపడుతుంది. మీ బంగారం మంచిదే అయినపుడు, ఇందులో తప్పేముంది?''అని ప్రశ్నించాడు సూటిగా.

''రాఘవులు గారూ!'' కోపంగా అరిచాడు సుబ్బయ్య.

''ఇంక పదిమాటలనవసరం. ఏదో అబ్బాయి ఇష్టపడుతున్నాడని, ఈ సంబంధం స్థిరపరిచాను గానీ లేకపోతే...''

''సుబ్బయ్యగారూ! మా అమ్మాయి కోరుకున్న సంబంధం అనిగాని, లేకపోతే, జీవం రాళ్ళపై బ్రతికే ఇలాంటి అబ్బాయికి నాపిల్లను ఇవ్వనే ఇవ్వను''అన్నాడు. విసురుగా రాఘవులు.

అనుకోకుండా మాటలు పెరగటంతో ఎలా సర్ది చెప్పాలో తోచలేదు,రామలింగానికి. విసవిసా పందిట్లోకి వచ్చారు పెద్దలు.

''మేనమామ గారూ! అమ్మాయిని బుట్టలో కూర్చుండబెట్టి తీసుకురండి'' అన్నాడు పురోహితుడు.

పెళ్ళికొడుకు దగ్గరగా వచ్చి, ''విస్సు! ఈ పెళ్ళి జరగదు లేరా అబ్బాయ్'' అన్నాడు సుబ్బయ్య బాధగా.

''నాన్నా!''అంటూ ఒక్క ఉదుటున లేచి, ''ఏం నాన్నా! ఏమిటి? ఏమైంది?'' అన్నాడు ఖంగారుగా విశ్వనాథం.

''నేను చెప్తా!– నీకున్న జబ్బుని కప్పెపెట్టి ఈ వివాహం జరుపుకో చూసినందుకు'' అన్నాడు రాఘవులు ముందరకొచ్చి.

## పెళ్ళి

''నాకు జబ్బా? ఏమిటి? ఎవరన్నారు?'' అయోమయంగా అడిగేడు విశ్వనాథం.

''ఎవరంటే ఏంలే! మా అదృష్టం బాగుండి మాకు ఇప్పటికైనా తెలిసింది. లేకపోతే పండంటి మా అమ్మాయి జీవితం ఏమయి పోయేది?!''

''మామగారూ! అర్థం లేకుండా మాట్లాడకండి. అసలు విషయం సరిగ్గా చెప్పండి. ఇవేవో కిట్టని వాళ్ళన్న మాటలు'' అనునయంగా అడిగాడు విశ్వనాథం.

''పోనీ బాబూ! ఏది ఏమైనా ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు''అన్నాడు సుబ్బయ్య పైమీది గుడ్డ దులుపుకుంటూ. రామలింగానికి ఏమనాలో తెలియలేదు. ప్రేక్షకునిగామాత్రమే ఉండిపోయాడు.

''మామగారూ! ఖంగారు పడకండి. మీ తొందరపాటువల్ల రెండు జీవితాలు బలికానివ్వకండి'' అంటూ తండ్రి కేసి తిరిగాడు విశ్వనాథం. ''నాన్నా! నిండుమనసుతో మా వివాహానికి అంగీకరించారు మీరు. ఈమాటల వల్ల మీ మనసుబాధ పెట్టుకోకండి''అంటూ లోపలికి వెళ్ళాడు.

### దెయ్యాల సంతతి ?

బ్రిటన్‌కి చెందిన మెటాఫిజిక్స్ పరిశోధనా సంస్థ ఉనికిలో 457 దెయ్యాలు వున్నట్టు లెక్కగట్టింది. ఈ దెయ్యాల్ని చూసిన ప్రత్యక్ష సాక్షులున్నారు. ఈ 457 దెయ్యాల్లో మగ, ఆడ దెయ్యాలు వున్నాయట. 1933 లో దెయ్యాల జనాభా లెక్కలు సేకరించినప్పుడు 404 దెయ్యాలు వున్నట్టు తేలిందట.

అందరూ అయోమయంగా అటుకేసి చూస్తూ నిలబడి పోయేరు. విశ్వనాథం శోభారాణిని సమీపించి,ఆమెని చూసి, దిగ్భ్రమ చెందాడు. పెళ్ళికూతురుగా ఆమె అందం ద్విగుణీకృతమై కళ్ళు చెదరేలా ఉంది. శోభారాణికి కూడా విషయం తెలిసి ఖంగారు పడుతోంది.

''శోభారాణీ! మీ నాన్నగారు నా గురించి ఏమంటున్నారో నీకు తెలుసును. దానికి నీ వేమంటావు? చెప్పు. ఈ వివాహం నీకిష్టమేనా?'' సూటిగా అడిగాడువిశ్వనాథం.

శోభారాణి తలవంచుకుని అంది, ''మీరు నన్ను ఇలా అడుగుతున్నందుకు, ఇలా అడగవల్సి వచ్చినందుకు నాకు చాలా బాధగా ఉంది. మా నాన్న ఒట్టి ఖంగారు మనిషి. దయుంచి ఆయన మాటల వల్ల మీ మనసు కష్టపెట్టుకోకండి. ఇపుడు మీరు నా అభిప్రాయం అడగటానికి వచ్చారంటే, ఇంతేనా మీరు నన్ను అర్థం చేసుకున్నది?'' విశ్వనాథం వెన్ను తట్టినట్లయింది.

''నన్ను క్షమించు శోబా! పెళ్ళి ఆగదు'' అంటూ పందిట్లోకి వచ్చాడు విశ్వనాథం.

కోలాహలంగా తయారైన పెళ్ళి పందిరి విశ్వనాథం రాకతో నిశ్శబ్దమై పోయింది.

''అమ్మాయి పైన బాగోగులు చూసే వాళ్ళం మేము. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు'' అన్నాడు రాఘవులు తిరస్కారంగా.

''మామగారూ! మీ కిష్టమైతే జరగటానికీ, లేకుంటే ఆగిపోవటానికి, ఇదేమీ బొమ్మల పెళ్ళి కాదు. దీనితో రెండు జీవితాలు ముడిపడి ఉన్నాయి. నేను చదువుకున్నవాణ్ణి. నాకూ వ్యక్తిత్వం, సంస్కారం ఉన్నాయి. మూఢ నమ్మకాలకూ, అసూయాపరుల మాటలకు నేను లొంగను. ఈ పెళ్ళి జరిగి తీరుతుంది. ఇపుడు మీరు కాదంటే, ఈ పెళ్ళి రిజిస్ట్రారాఫీసులో జరుగుతుంది.'' అని ఒక్కసారి రాఘవులు ముఖంలోకి చూసి, వెళ్ళి పెళ్ళిపీటమీద కూచున్నాడు విశ్వనాథం.

రాఘవులు నిశ్చేష్టుడై నిలబడిపోయేడు.

పెళ్ళికూతురు మేనమామ, రామలింగం ముఖంమీద సంతోషం మెరిసింది. భజంత్రీలను వాయించమని సంజ్ఞచేసి, తాను బుట్టపుచ్చుకుని పెళ్ళికూతురు దగ్గరకు వెళ్ళాడు.

బుట్ట క్రిందపెట్టి, ''రా అమ్మా!'' అన్నాడు రామలింగం.

''మావయ్యా! నాన్న...'' అంది ఆందోళనగా శోభారాణి.

''మీ నాన్న మాటలకేంలేమ్మా. ఒట్టి ఖంగారు మనిషి, రేపు అతనే తెలుసుకుంటాడులే, నిజమేదో, అయినా ఇందులో పూర్తిగా తప్పు నాదమ్మా. ఏది సత్యమో ఆలోచించలేకపోయేను; విశ్వనాథం ఘటికుడమ్మా! నువ్వు చాలా అదృష్టవంతురాలివి ...'' అన్నాడు బుట్టపట్టుకునిరామలింగం. సిగ్గుతో ముడుచుకుపోయి, బుట్టలో ఒదిగి కూచుంది, పెళ్ళికూతురు.

పందిట్లో భజంత్రీల మోత తారస్థాయినందుకుంది.